క్లుప్తంగా

మహిళలను గౌరవించాలి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీవో కనకదుర్గ

రాజాం సిటీ: ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించాలని ఐసీడీఎస్ పీవో కె.కనకదుర్గ కోరారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో మహిళల హక్కులు, చట్టాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. పురుషులతో సమానంగా మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారని, అలాంటి వారు కొన్నిచోట్ల నిర్లక్ష్యానికి గురవుతున్నారన్నారు. ముఖ్యంగా పని ప్రదేశంలో మహిళలు లైంగిక వేధింపులకు గురవుతున్నారని, మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.కె.రాజు, మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు, ఎంపీడీవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



జవాన్ శంకరరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న జిల్లా సైనిక సంక్షేమ అధికారి సత్యప్రసాద్

బాడంగి: మండలంలోని బొత్సవానివలస గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ గొట్టాపు శంకరరావు జమ్మూకశ్మీర్‌లో గ్యాస్ సిలిండర్ పేలుడు ఘటనలో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా సైనిక సంక్షేమ అధికారి కెప్టెన్ సత్యప్రసాద్ ఆ గ్రామానికి శుక్రవారం వెళ్లి, బాధిత కుటుంబ సభ్యులను కలిసి, పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం నుంచి రావాల్సిన సాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. శనివారం ప్రభుత్వ లాంఛనాలతో గ్రామంలోనే జవాన్ అంత్యక్రియలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా మాజీ సైనికుల అధ్యక్షుడు మరడ అప్పారావు తెలిపారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



ప్రచారంలో ఇందూ జ్ఞాన వేదిక ప్రబోధ సేవా సమితి సభ్యులు

రేగిడి: మండలంలోని సంకిలి, చిన్నయ్యపేట, బొడ్డవలస గ్రామాల్లో శ్రీకాకుళం జిల్లాకు చెందిన త్రైత సిద్ధాంత భగవద్గీత ఇందూ జ్ఞాన వేదిక ప్రబోధ సేవా సమితి సభ్యుడు సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం శుక్రవారం నిర్వహించారు. భగవద్గీతే ప్రపంచాన్ని నడిపిస్తుందని, భగవద్గీతను చదివి, మానవజన్మ సదుద్దేశ్యం గ్రహించి, ఉత్తమ జీవనం సాగించాలని భక్తులు కోరారు.

నిత్యవసర సరుకుల వితరణ



పేదలకు నిత్యవసర సరుకులు అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

వంగర: మండలంలోని కొప్పరవలస గ్రామంలో స్పందన అనే స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు సాదెం వెంకటరమణ ఆధ్వర్యంలో నిరుపేదలకు నిత్యవసర సరుకులు శుక్రవారం వితరణ చేశారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా పూట గడవడమే కష్టంగా ఉన్న కుటుంబాలకు ప్రతినెలా బియ్యం, కందిపప్పు, ఆయిల్ వంటి సరుకులు అందిస్తున్నట్లు వెంకటరమణ తెలిపారు.

హెల్మెట్ తప్పనిసరి

బొబ్బిలి: ద్విచక్ర వాహనదారులంతా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని బొబ్బిలి సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ సూచించారు. స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయ విజ్ఞాన సదస్సు శుక్రవారం నిర్వహించి, హెల్మెట్ ధరించకపోవడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. హెల్మెట్ ధరించకపోవడం కారణంగానే చాలామంది ద్విచక్ర వాహనదారులు రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందుతున్నారని తెలిపారు. ప్రతీ వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించి, ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.దామోదరరావు తదితరులు పాల్గొన్నారు.

దశపత్ర కషాయంతో తెగుళ్ల నివారణ

రేగిడి: దశపత్ర కషాయంతో మొక్కజొన్న పంటకు సోకే అనేక తెగుళ్లను నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయం ఎల్‌2లు గౌరీశ్వరరావు, సురేష్‌లు తెలిపారు. మండలంలోని చాటాయివలస గ్రామంలో ఎన్‌పీఎం షాపు వద్ద ఏవో మురళీకృష్ణ ఆధ్వర్యంలో రైతులకు దశపత్ర కషాయం తయారీపై శుక్రవారం అవగాహన కల్పించారు. దేశీ ఆవుమూత్రం, వేప, సీతాఫలం, బొప్పాయి, ములగ, పొగాకు, కలబంద, జామ, అతిబల, మారేడు, ఆముద, జిల్లేడు ఆకులతో పాటు పచ్చిమిర్చి, వెల్లుల్లిలతో కషాయాన్ని ప్రయోగాత్మకంగా తయారు చేసి, వివరించారు. రెండు కిలోల చొప్పున ఆకులు తీసుకుని వాటిని మొత్తగా ముద్దచేసి, ఆ తర్వాత 200 లీటర్ల డ్రమ్ములో వేసి ఆవు మూత్రం కలిపి, రోజూ కొంచెం నీటిని ఇందులో వేసి కలియబెట్టాలని, 40 రోజుల తరువాత కాషాయం తయారవుతుందన్నారు.

కొప్పర యువత ఆదర్శం

- శ్రమదానంతో పాఠశాల మైదానం బాగుచేసిన వైనం
- యువత పనితీరును అభినందిస్తున్న గ్రామస్తులు



ఐదురోజుల క్రితం పిచ్చిమొక్కలతో పాఠశాల మైదానం ఇలా..



ట్రాక్టరు సాయంతో చదును చేస్తున్న దృశ్యం



చెట్లకొమ్మలు తొలగించి, బయటపడేస్తున్న యువత



బాగుచేసిన తర్వాత పాఠశాల మైదానం ఇలా..

వంగర: యువత తలచుకుంటే ఏ పని అయినా చేయగలరన్నది నిరూపించారు.. మండలంలోని కొప్పర గ్రామ యువకులు. కొన్నేళ్లుగా గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానం, పరిసరాలు పిచ్చిమొక్కలతో నిండిపోయి చాలా అధ్వానంగా తయారైంది. దీంతో అక్కడి నుంచి వచ్చే క్రిమికీటకాలు, దుర్గంధంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను ఎలాగైనా పరిష్కరించుకుందామని యువకులు ఆలోచన చేశారు. స్వచ్ఛందంగా విరాళాలు సేకరించారు. ఆ డబ్బులతో ట్రాక్టరును అద్దెకు తీసుకుని, జంగిల్స్, పిచ్చిమొక్కలు తొలగించి, చదును చేశారు. ఇప్పుడు పాఠశాల పరిసరాలు చాలా బాగుండడంతో అటువైపుగా వెళ్లే వారంతా యువత పనిని మెచ్చుకుంటున్నారు.

విత్తనశుద్ధితో చీడపీడలు దూరం



జీవామృతం తయారీని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

వంగర: మండలంలోని కింజంగి గ్రామంలో విత్తన శుద్ధి, జీవామృతం తయారీలపై శుక్రవారం అవగాహన కల్పించారు. మండల రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఏపీఎం తెర్లి మంగమ్మ మాట్లాడుతూ సాగుకు ముందు విత్తనాలను శుద్ధి చేసుకుని వేసుకోవడం ద్వారా పంటకు చీడపీడలు, తెగుళ్లు సోకవన్నారు. పంట బాగా పండి, అధిక దిగుబడులు లభిస్తాయన్నారు. వ్యవసాయంలో రసాయనిక ఎరువులు బదులు సేంద్రియ ఎరువులను వినియోగించి, ఆరోగ్యవంతమైన పంటను సమాజానికి అందించాలని కోరారు. అనంతరం విత్తనశుద్ధి, జీవామృతం తయారీని ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం మరువాడ యూనిట్ ఇన్‌చార్జి ఆర్నిపల్లి సింహాద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

రేగిడి: ఆరోగ్యమే మహాభాగ్యమని ఐసీడీఎస్ రేగిడి సెక్టార్ సూపర్‌వైజర్ శశికళ అన్నారు. మండలంలోని ఆమదాలవలస, రేగిడి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార ప్రదర్శన శుక్రవారం నిర్వహించారు. అనంతరం పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. మనం తీసుకునే ఆహారంలో పౌష్టికాహార పదార్థాలు ఉండేలా చూసుకోవాలని, మెరుగైన ఆరోగ్యానికి గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

మండలంలోనే అర్జీలు ఇవ్వాలి

రేగిడి: ప్రజాసమస్యల పరిష్కారానికి మండల పరిషత్ కార్యాలయంలోనే అర్జీలు ఇవ్వాలని ఎంపీడీవో జి.వి.ఆర్.ఎస్.వి.శ్యామలాకుమారి అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక(గ్రీవెన్స్‌సెల్) నిర్వహిస్తున్నామని, ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగే ఈ కార్యక్రమంలో ప్రజలు అర్జీలు సమర్పించుకోవాలన్నారు. ఇక్కడ పరిష్కారం కాని సమస్యలకు సంబంధించిన అర్జీలు మాత్రమే జిల్లా కేంద్రానికి తీసుకువెళ్లాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి రోడ్డులోని విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా మండలంలోని గోపాలపురం, కంచరాం, ఆగూరు, గడిముడిదాం, కొండంపేట, వస్త్రపురికాలనీ ప్రాంతాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏఈ కుమార్ శుక్రవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ అసౌకర్యం ఉంటుందని, వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

రేపటి నుంచి సోషల్ ఆడిట్

రామభద్రపురం: మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో 2023–24 ఏడాదిలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులకు సంబంధించి, ఈ నెల 14వ తేదీ నుంచి సోషల్ ఆడిట్ చేపట్టనున్నట్లు రాష్ట్ర రిసోర్స్‌పర్సన్(ఎస్‌ఆర్‌పీ) కె.మన్మధరావు తెలిపారు. స్థానిక ఉపాధి హామీ పథకం కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ మండలంలోని 10 మంది డీఆర్‌పీలతో కలిసి రూ.16.96 కోట్ల నిధులతో చేపట్టిన ఉపాధి పనులు, సామాజిక పింఛన్లపై ఆడిట్ నిర్వహించనున్నామన్నారు. అన్ని శాఖల అధికారులు సోషల్ ఆడిట్ సజావుగా జరిగేలా చూడాలన్నారు. వివిధ ప్రాంతాల్లో చేపట్టిన పనులను ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు పక్కాగా చూపితే తనిఖీ ప్రక్రియ తొందరగా పూర్తవుతుందని, పంచాయతీరాజ్ శాఖ ద్వారా చేపట్టిన పనులను చూపాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, ఆరోపణలను గ్రామసభలు నిర్వహించి, వివరిస్తామన్నారు. అభ్యంతరాలుంటే సంబంధిత సిబ్బంది ఆధారాలు చూపితే నివేదిక నుంచి తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీవో త్రినాధరావు, తదితరులు పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్ల పంపిణీ



తెర్లాం: రాజయ్యపేటలో స్టూడెంట్ కిట్లుతో విద్యార్థులు



రాజాం సిటీ: విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందిస్తున్న ఎంపీటీసీ పద్మావతి

రాజాం సిటీ: మండలంలోని గార్రాజుచీపురుపల్లి గ్రామ ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు శుక్రవారం పంపిణీ చేశారు. అన్ని తరగతుల విద్యార్థులకు వీటిని అందించామని హెచ్‌ఎం గురుమూర్తి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ధర్మాన పద్మావతి, సర్పంచ్ భీమేశ్వరరావు, ఉపాధ్యాయులు లక్ష్మీప్రసాద్, అప్పలరాజు, రమణమ్మ, రామారావు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం: మండలంలోని రాజయ్యపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు జి.శంకరరావు, సర్పంచ్ ప్రతినిధి ఎం.రమణ చేతులమీదుగా విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు, షూ తదితర విద్యాసామగ్రిని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులంతా ఈ స్టూడెంట్ కిట్లను సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీసీ చైర్మన్ పి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లలో జోరు పెంచండి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: పన్నుల వసూలు చేయడంలో జోరు పెంచాలని సంబంధిత అధికారులకు మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో అన్ని సచివాలయాల కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బందితో శుక్రవారం సమావేశమైన ఆమె.. పెండింగ్‌లోని పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని, ఖాళీ స్థలాలు, కుళాయిలు, ఇంటి పన్నుల వసూళ్లపై ఇకనుంచి ప్రతీ వారం సమీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. తర్వాతి సమీక్ష నాటికి ప్రతీ సచివాలయం పరిధిలో పన్నుల వసూళ్లు పూర్తికావాలన్నారు. సమావేశంలో ఆర్‌వో ప్రసాదరావు, ఆర్ఐ సురేష్‌పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాసం పెంపకంపై అవగాహన



పశుగ్రాసం పెంపకంపై అవగాహన కల్పిస్తున్న నెమలాం పశువైద్య కేంద్రం వైద్యురాలు అరుణ

తెర్లాం: ఆవులు, గేదెలు అధికంగా పాలు ఇవ్వాలంటే వాటికి ప్రతిరోజూ పచ్చగడ్డిని మేతగా వేయాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ జె.నరేంద్రకుమార్, నెమలాం పశు వైద్యకేంద్రం వైద్యురాలు అరుణ సూచించారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా తెర్లాం, ఆమిటి, కూనాయవలస పంచాయతీల్లో పశుగ్రాసంపై శుక్రవారం అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ పాడి పశువులు ఉన్న రైతులంతా తప్పనిసరిగా పశుగ్రాసాన్ని పెంచుకోవాలన్నారు. పచ్చగడ్డిలో పాడి పశువులకు కావాల్సిన పోషకాలు ఉంటాయన్నారు. రైతులకు కావాల్సిన పశుగ్రాస విత్తనాలు స్థానికంగా ఉన్న రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ డి.తేజ, సచివాలయ పశుసంవర్ధక సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉంటే చర్యలు



డి.గదబవలస పాఠశాల మరుగుదొడ్లు తనిఖీ చేస్తున్న ఎంఈవో త్రినాధరావు

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లోని మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉంటే సంబంధిత స్కావెంజర్స్‌పై చర్యలు తీసుకునేందుకు వెనుకాడేదిలేదని ఎంఈవో జె.త్రినాధరావు హెచ్చరించారు. మండలంలోని డి.గదబవలస ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాన్ని, విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు, రికార్డులు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, చేతిరాత, హోంవర్కు పుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకం వంటకాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం తప్పనిసరిగా పాఠశాలలోని మరుగుదొడ్లను శుభ్రం చేయించాలన్నారు. అలాగే నాణ్యమైన విద్యనందించాలని, చదువులో వెనకబడిన విద్యార్థి విద్యాప్రగతిపై దృష్టిసారించాలన్నారు.

కార్మికుల తొలగింపు అన్యాయం

బొబ్బిలి: పట్టణంలోని పార్కుల్లో పనిచేస్తున్న కార్మికులను అక్రమంగా తొలగించడం చాలా అన్యాయమని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పొట్నూరు శంకరరావు, టీవీ రమణలు ఖండించారు. ఇదే విషయమై వారు శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఆడిట్ అధికారుల అభ్యంతరాల మేరకు వారిని తొలగించారని, వారిని వెంటనే మళ్లీ విధుల్లోకి చేర్చుకోవాలన్నారు. అలాగే వారి జీతభత్యాలకు వినియోగిస్తున్న వేతనాల వ్యత్యాసంపై కూడా సమగ్ర దర్యాప్తు చేయాలని కోరారు.

578 మందికి సీసీఆర్‌సీలు అందజేత

రాజాం: నియోజకవర్గంలో కౌలురైతుల గుర్తింపు ప్రక్రియ ముగిసిందని వ్యవసాయ శాఖ ఏడీఏ కె.చంద్రరావు శుక్రవారం తెలిపారు. వ్యవసాయ శాఖ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పది రోజుల పాటు రైతు సేవా కేంద్రాల్లో కౌలురైతుల గుర్తింపు సమావేశాలు జరిగాయని, నియోజకవర్గం వ్యాప్తంగా మొత్తం 578 మంది కౌలురైతులకు సీసీఆర్‌సీ(క్రాప్ కల్టివేటర్ రైట్ కార్డ్స్)లు ఇవ్వడం జరిగిందన్నారు. రాజాం మండలంలో 233 మందికి, రేగిడిలో 63 మందికి, సంతకవిటిలో 221 మందికి, వంగరలో 61 మందికి ఈ కార్డులు ఇచ్చామన్నారు. వీరికి ప్రభుత్వం సాధారణ రైతుకు కల్పిస్తున్న రాయితీలన్నీ వర్తిస్తాయన్నారు.

తాగునీటి నాణ్యత పరిశీలన

తెర్లాం: స్థానిక మూడో అంగన్‌వాడీ కేంద్రంలో బోరుబావులు, ఇంటింటి కుళాయిల ద్వారా ప్రజలు తాగుతున్న నీటి నాణ్యతను శుక్రవారం పరీక్షించి, పరిశీలించారు. సురక్షితమైన తాగునీటిని ప్రతిరోజూ తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని తెర్లాం సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ శ్రీరామ్, ఏఎన్ఎం ప్రశాంతిలు తెలిపారు. తాగునీటి వనరుల్లో తప్పనిసరిగా క్లోరినేషన్ చేయాలన్నారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

- మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు



మొక్కలు నాటుతున్న మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు

రాజాం సిటీ: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు అన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఆవరణలో వికాస తరంగిణి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజాంను పచ్చరాజాంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ ఖాళీ ప్రదేశాల్లో, ఇంటి ఆవరణల్లో మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటడమే కాకుండా నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యతలు కూడా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు ఎస్.కె.రాజు, ఎంపీడీవో వి.శ్రీనివాసరావు, ఐసీడీఎస్ పీవో కనకదుర్గ, వికాస తరంగిణి సెంట్రల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి రమణమూర్తి, ఏపీవో కె.సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే నిధులు మంజూరు చేయండి



మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర సుజల స్రవంతి సాధన సమితి కార్యదర్శి అప్పలనాయుడు

రాజాం: ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పెండింగ్ ప్రాజెక్టుకు కావాల్సిన నిధులను ప్రభుత్వం తక్షణమే మంజూరు చేయాలని బాబు జగజ్జీవన్‌రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి సాధన సమితి డిమాండ్ చేసింది. ఇదే విషయమై స్థానిక పట్టణంలో ఆ సమితి రాష్ట్ర కార్యదర్శి బుడితి అప్పలనాయుడు శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, మాట్లాడారు. ప్రాజెక్టు కోసం దశల వారీగా పోరాటం చేస్తామని, ఇందులో భాగంగా ఈ నెల 15వ తేదీన కలెక్టర్‌కు విజయనగరంలో వినతిపత్రం అందివ్వనున్నామన్నారు. ఈ కార్యక్రమానికి రైతులు పెద్దఎత్తున హాజరుకావాలని కోరారు. తోటపల్లి, జంఝావతి, తారక రామతీర్థసాగరం, మడ్డువలస ప్రాజెక్టుకు నిధులు ఇచ్చి, పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. ఇటీవల సీఎం చంద్రబాబు ఉత్తరాంధ్ర సుజల స్రవంతి కాలువన పరిశీలించారని, రూ.800 కోట్లతో 1.20 లక్షల ఎకరాలకు సాగునీటిని ఇచ్చే ఈ ప్రాజెక్టును పూర్తిచేస్తామని తెలిపారన్నారు. అయితే కృష్ణా, గోదావరి, వంశధార నదుల అనుసంధానం పేరుతో ఈ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులు కనుమరుగయ్యే పరిస్థితి ఉందన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి ఇప్పుడే నిధులు ఇవ్వాలని, లేకుంటే విడతల వారీగా ఉద్యమం తీవ్రతరం చేస్తామన్నారు. జిల్లాలోని తాటిపూడి రిజర్వాయర్‌తో పాటు 40 ఏళ్లు దాటిన ప్రాజెక్టులలో పూడికలు తొలగించేందుకు అధ్యయన కమిటీని వేసి, పనులు చేసేలా చూడాలని, లేకపోతే ప్రాజెక్టులలో నీటినిల్వ శాతం తగ్గిపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ సమస్యలన్నింటిపై కలెక్టర్‌ను కలవనున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నారు జనార్దనరావు, ఆదర్శ రైతు పెంకి గౌరీశ్వరరావు, ప్రజాసంఘాల నేతలు యు.నీలకంఠేశ్వర్‌యాదవ్, ఏపీ కౌలు రైతు సంఘం పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు రామ్మూర్తినాయుడు తదితరులు పాల్గొన్నారు.

డయేరియా నిర్మూలనకు కృషి చేయాలి



డయేరియా నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు

రాజాం: ప్రతిఒక్కరూ డయేరియా నిర్మూలనకు కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు కోరారు. స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని గాయత్రి కాలనీలో స్టాప్ డయేరియా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు డయేరియా లక్షణాలు, డయేరియా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కలుషిత నీరు, ఆహారం తీసుకోవడం ద్వారా డయేరియా బారినపడతామని, ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటిస్తే ఆ వ్యాధి నుంచి దూరంగా ఉండొచ్చన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిరసన

రామభద్రపురం: బకాయి వేతనాలు మంజూరు చేయాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు (సీఆర్‌పీలు, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్, డేటాఎంట్రీ ఆపరేటర్, ఐఈఆర్‌టీలు, ఆయాలు) స్థానిక ఎంఆర్‌సీ ఎదుట శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండు నెలలుగా జీతాలు అందకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. చాలీచాలని జీతాలతో కుటుంబాలను అత్యంత కష్టంమీద పోషించుకుంటున్న తమకు వేతన బకాయిలు ఉంచడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, తమపట్ల వివక్ష చూపకుండా జీతాలు చెల్లించాలన్నారు.

రైతుకు ఏడాదికి రూ.20 వేలు సాయం

- ఎమ్మెల్యే బేబీనాయన



ఎరువులు అందజేస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

రామభద్రపురం: కేంద్ర ప్రభుత్వంతో సంబంధం లేకుండా ఒక్క రాష్ట్ర ప్రభుత్వమే అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు ఏడాదికి రూ.20 వేలు పెట్టుబడి సాయం ఇవ్వడానికి హామీ ఇచ్చిందని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన ఎరువుల పంపిణీకి హాజరైన ఆయన.. గతంలో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం కలిసి ఏడాదికి రూ.13,500 రైతు భరోసా పథకం కింద ఇచ్చేదని, ఇప్పుడలా కాదని ఒక్క రాష్ట్ర ప్రభుత్వమే రూ.20 వేలను అందించనుందన్నారు. ధాన్యం కొనుగోలు, బిల్లుల చెల్లింపులు, ఇన్‌పుట్ సబ్సిడీలో కూడా ప్రభుత్వం జాప్యం చేయదన్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూడాలని అధికారులకు సూచించారు కార్యక్రమంలో సర్పంచ్ ఈశ్వరరావు, ఎంపీటీసీ వసంతుల తిరుపతిరావు, తహసీల్దార్ సులోచనరాణి, ఎంపీడీవో రమామణి, ఏవో వెంకటయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు



బొద్దూరులో ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు



రాజాం: ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు నాగయ్య

సంతకవిటి: ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు. మండలంలోని సంతకవిటి జిల్లా పరిషత్ పాఠశాల నుంచి పి.పావని, సీహెచ్ కావ్య, కె.జగన్‌మోహన్, బొద్దూరు జిల్లా పరిషత్ పాఠశాల నుంచి ఎస్.శ్రావణి, డి.దామోదర్, సీహెచ్ వాసు, మామిడిపల్లి జిల్లా పరిషత్ పాఠశాల నుంచి కె.నందిని, సిరిపురం జిల్లా పరిషత్ పాఠశాల నుంచి ఎ.వాహిని, సంతకవిటి కేజీబీవీ నుంచి యు.లిఖిత ట్రిపుల్ ఐటీలకు ఎంపిక కాగా, వారిని వారి వారి పాఠశాలల్లో సిబ్బంది అభినందించి, ఆల్ ది బెస్ట్ చెప్పారు.

రాజాం: రాజీవ్‌గాంధీ ట్రిపుల్ ఐటీకి ఎంపికైన రాజాం ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను పాఠశాలలో శుక్రవారం సన్మానించి, అభినందించారు. మొత్తం ఎనిమిది మంది విద్యార్థులు ఎంపికయ్యారని, వారిలో శంకరరావు, పందూరి దుర్గాభవాని, ఆరెల్లా తరుణ్, కనకం జశ్వంత్, గుడియా ధీరజ్, తనూజ, తాడ్డి లాస్య, పొట్టా రమ్య ఉన్నారన్నారు. ఫస్ట్ ఫేజ్ కౌన్సెలింగ్‌లోనే ఈ విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందని హెచ్‌ఎం పొండ్రంకి నాగయ్య అన్నారు.